క్లుప్తంగా

నేడు పెద్దఅంబర్‌పేటలో బోనాలు

అబ్దుల్లాపూర్‌మెట్ : పెద్దఅంబర్‌పేటలో ఆదివారం బోనాల ఉత్సవాలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గ్రామంలోని అమ్మవార్ల ఆలయాలను రంగులు, విద్యుత్ దీపాలతో అలంకరించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు.

పండుగ సాయన్న పోరాటం చిరస్మరణీయం

ఇబ్రహీంపట్నం: పండుగ సాయన్న విగ్రహాన్ని ట్యాంక్ బ్యాండ్‌పై ప్రతిష్ఠించాలని ముదిరాజ్ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు బిక్షపతి డిమాండ్ చేశారు. పండుగ సాయన్న 134 జయంతిని ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నంలో శనివారం నిర్వహించారు. సాయన్న చిత్రపటానికి నివాళులు అర్పించారు. అనంతరం బిక్షపతి మాట్లాడుతూ సాయన్న పోరాటం చిరస్మరణీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వెంకటేశ్, స్థానిక మండల అధ్యక్షుడు లింగం తదితరులు పాల్గొన్నారు.

బండి నియామకంపై హర్షం

తలకొండపల్లి: రాష్ట్ర బీజేపీ మాజీ అధ్యక్షుడు, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కు పార్టీ అధిష్టానం కీలక పదవీ కట్టబెట్టింది. ఆయనను జాతీయ కార్యవర్గంలోకి తీసుకుంది. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా బీజేవైఎం రాష్ట్ర అధనపు కార్యదర్శి నీలకంఠం పాండు శనివారం హర్షం వ్యక్తం చేశారు. బండి సంజయ్‌కి శుభాకాంక్షలు తెలిపారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఆర్డీఓ

అబ్దుల్లాపూర్‌మెట్: మండలంలోని కుత్బుల్లాపూర్, పసుమాముల, గౌరెల్లి, బండరావిరాల గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసే పోలింగ్ కేంద్రాలను శనివారం ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంతరెడ్డి పరిశీలించారు. సాధారణ ఎన్నికలు రానున్న నేపథ్యంలో ఈ కేంద్రాలను పరిశీలించినట్లు అధికారులు తెలిపారు.

ఘనంగా దేవునిపడకల్‌లో వేంకటేశ్వరస్వామి కల్యాణం



స్వామి వారికి కల్యాణం నిర్వహిస్తున్న పురోహితులు

తలకొండపల్లి: మండలంలోని దేవుని పడకల్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం స్వామి కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఆలయాన్ని రంగు రంగుల పూలు, విద్యుదీపాలంకరణతో అలంకరించారు. వేద పండితుల మంత్రోచ్చారణాల మధ్య ముత్యాల తలంబ్రాలతో మంగళ సూత్రధారణ చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రాజుకుమార్, ఉప సర్పంచ్ తిరుపతి, ఈఓ మోహన్‌రావు, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

మత్తడి దుంకుతున్న పులందరి చెక్‌డ్యాం



మత్తడి దుంకుతున్న పులందరి చెక్‌డ్యాం

ఇబ్రహీంపట్నం రూరల్: గత వారం రోజులుగా కుండపోతగా కురిసిన వర్షానికి ఇబ్రహీంపట్నం మండలం, ఆదిబట్ల మున్సిపాలిటీలోని చెరువులు, కుంటలకు జలకళను సంతరించుకున్నాయి. మల్శెట్టిగూడ సమీపంలో ఉన్న పులందరి చెక్‌డ్యాం నిండుకుండలా మారింది. రెండు రోజులుగా మత్తడి దుంకుతోంది. రైతులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కొత్త నీరు వస్తుండటంతో చేపలు పడుతున్నారు. అలాగే ఫిరంగి నాలా, పెద్దవాగు నిండుగా పారుతున్నాయి. ఇబ్రహీంపట్నం పెద్ద చెరువులోకి వరద నీరు వస్తోంది.

ఎస్‌ఐకి సత్కారం

ఆమనగల్లు: ఆమనగల్లు ఎస్‌ఐ బాల్‌రాంను ఆర్యవైశ్య సంఘం నాయకులు సత్కరించారు. ఆమనగల్లు పట్టణంలోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో శనివారం ఎస్‌ఐ సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయం ఆవరణలో ఆయనను ఆలయ కమిటీ అధ్యక్షుడు రామ్మోహన్ సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి నర్సింహా, కోశాధికారి శ్రీనివాస్, పలువురు ఆర్యవైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు.

మేం ఏం పాపం చేశాం?



ధర్నా చేస్తున్న పంచాయతీ కార్మికులు



మంచాలలో పీర్లను వేడుకుంటున్న జీపీ కార్మికులు

యాచారం: ''ముఖ్యమంత్రి కేసీఆర్ సారూ... మేం ఏం పాపం చేశాం. పారిశుద్ధ్య పనుల్లో ప్రాణాలను కూడా లెక్కచేయకుండా పని చేస్తున్నాం. మా బాధను గుర్తించి వెంటనే పర్మినెంట్ ఉద్యోగులుగా గుర్తించాలి'' అని పంచాయతీ కార్మికులు డిమాండ్ చేశారు. సమ్మెలో భాగంగా శనివారం యాచారం గ్రామ పంచాయతీ ఎదుట పంచాయతీ సిబ్బంది ధర్నా చేశారు. తమను ఉద్యోగాలను పర్మినెంట్ చేసి.. నెలకు రూ. 19,500 జీతం ఇవ్వాలని కోరారు. జీపీ కార్మికులు చేస్తున్న సమ్మె శనివారానికి 24వ రోజుకు చేరింది.

24వ రోజుకు చేరిన సమ్మె

ఇబ్రహీంపట్నం: గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మికులు తమ సమస్యలను పరిష్కరించాలని చేస్తున్న సమ్మె శనివారం 24వ రోజుకు చేరింది. ఇబ్రహీంపట్నం ఎంపీడీఓ కార్యాలయ వద్ద నిర్వహిస్తున్న సమ్మెను ఉద్దేశించి ఆ సంఘం నాయకులు దేవదాసు, బుగ్గ రాములు, యాదయ్య, మల్లేష్, భాస్కర్‌లు మాట్లాడుతూ.. జీపీ కార్మికులను పర్మినెంట్ చేయాలని, వేతనాలు పెంచాలని, కనీస సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

పంచాయతీ కార్మికులు 'పీర్లకు' వినతి

మంచాల: పంచాయతీ కార్మికులు వినూత్నంగా నిరసన చేపట్టారు. తమ సమస్యలను పరిష్కారించే విధంగా ముఖ్యమంత్రి కేసీఆర్‌లో మార్పు తీసుకుని రావాలని జీపీ కార్మికులు పీర్లను వేడుకున్నారు. శనివారం మంచాల మండల కార్యాలయం వద్ద 24వ రోజు సమ్మెకు దిగారు. మొహర్రం సందర్భంగా పీర్లను తయారు చేసి ఆటలాడారు. సీఐటీయూ మండల కన్వీనర్ కృష్ణ, జీపీ కార్మిక సంఘం నాయకులు పాష, భాస్కర్, రవి, చెన్నయ్య, అంజయ్య, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పీర్ల చావిడి నిర్మాణానికి చేయూత

తలకొండపల్లి: మండలంలోని వెంకటాపూర్‌లో పీర్ల చావిడి నిర్మాణానికి ఉప్పల ట్రస్టు చేయూతనిచ్చింది. ట్రస్ట్ చైర్మన్, జెడ్పీటీసీ ఉప్పల వెంకటేష్ సావిడి నిర్మాణానికి రూ. లక్ష ఆర్థిక సహాయం అందజేశారు. గ్రామంలో సావిడి లేక ఇబ్బంది పడుతున్నామని ముస్లింలు సర్పంచ్ రమేష్ యాదవ్, ఎంపీటీసీ సునీత దృష్టికి తెచ్చారు. సర్పంచ్, ఎంపీటీసీతో కలిసి ముస్లింలు వెంకటేష్‌ను కలిశారు. మసీద్ నిర్మాణానికి ఆర్థిక సహాయం చేయాలని కోరారు. స్పందించిన ఆయన మసీద్ నిర్మాణానికి రూ. లక్ష సహాయం చేస్తానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో సుదర్శన్‌రెడ్డి, ఎండీ ఖలీల్, రవి, నరేశ్, బాలస్వామి, రమేష్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

పేదల ఇళ్ల నిర్మాణానికి...

ఆమనగల్లు: ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని పలువురు నిరుపేదల ఇంటి నిర్మాణానికి ఉప్పల చారిటబుల్ ట్రస్టు సహాయం చేసింది. ఆమనగల్లుకు చెందిన లక్ష్మమ్మ ఇంటి నిర్మాణానికి అవసరమైన మెటీరియల్‌ను ట్రస్టు చైర్మన్, జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ శనివారం అందజేశారు.



నిర్మాణంలో ఉన్న పీర్ల సావిడి వద్ద సర్పంచ్, ఎంపీటీసీలు, ట్రస్ట్ సభ్యులు

అదృశ్యం.. కథ సుఖాంతం

- ఇంటికి చేరిన అన్నదమ్ములు
- చదువుకోమని ఒత్తిడి చేయడంతోనే వెళ్లిపోయినట్లు వెల్లడి

యాచారం: తల్లిదండ్రులు చదువుకోమని ఒత్తిడి చేస్తున్నారని, ఇంటి నుంచి పారిపోతే చదివే ఇబ్బంది ఉండదని భావించిన ఆ అన్నదమ్ములు ఇంట్లోని నగదు తీసుకుని బయటకు వెళ్లారు. నాటకీయ పరిస్థితుల్లో వీరిని గుర్తించిన పోలీసులు.. తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చిన విషయం తెలిసిందే. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.. మాల్ గ్రామానికి చెందిన శ్రీను, రేణుక దంపతుల ఇద్దరు కుమారులు(13, 11 ఏళ్లు).. శుక్రవారం తెల్లవారుజామున ఇంట్లోని రూ.80 వేల నగదు తీసుకుని బయటకు వెళ్లిపోయారు. ఎంజీబీఎస్‌లో బస్ ఎక్కి మెదక్ సమీపంలోని ఓ గ్రామంలో దిగారు. ఇక్కడ విక్రయిస్తున్న చిలుక బొమ్మలు కొనుగోలు చేసే సమయంలో అనుమానం వచ్చిన ఓ వ్యక్తి 100కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం అందించాడు. అప్పటికే తమ కుమారుల అదృశ్యంపై బాధిత తల్లిదండ్రులు యాచారం పీఎస్‌లో ఫిర్యాదు చేయడం.. ఈ విషయాలన్నీ సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టడంతో మెదక్ పోలీసులు వచ్చి ఇద్దరినీ తమ సంరక్షణలోకి తీసుకున్నారు. వెంటనే తల్లిదండ్రులకు ఫోన్ చేశారు. బీఆర్‌ఎస్ నాయకుడు చిన్నోళ్ల యాదయ్య సహకారంతో శుక్రవారం రాత్రి మెదక్ బయల్దేరిన బాలుర తల్లిదండ్రులు వారిని తీసుకుని తెల్లవారుజామున ఇంటికి చేరుకున్నారు. ఏది ఏమైనా తమ పిల్లల ఆచూకీ దొరకడంపై తల్లిదండ్రులు సంతోషం వ్యక్తంచేశారు.

వింత ఆకారంలో మేక పిల్ల జననం

- పుట్టిన కొద్ది నిమిషాల్లోనే మృతి
- చూసేందుకు బారులుదీరిన ప్రజలు

మంచాల: శిశువు రూపాన్ని పోలిన వింత ఆకారంలో ఓ మేక పిల్ల జన్మించిన సంఘటన రంగారెడ్డి జిల్లా మంచాల మండలం బండలేమూర్‌లో శనివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన రమావత్ మోత్యానాయక్ వృత్తిరీత్యా మేకల కాపరి. ఆయన మందలోని ఓ మేక తెల్లవారుజామున వింత (శిశువు) ఆకారంలో మేక పిల్లకు జన్మనివ్వగా.. పుట్టిన కొద్దిసేపటికే అది మరణించింది. కళ్లు, ముఖం మనిషి రూపాన్ని పోలి ఉండగా.. కాళ్లు, చెవులు మాత్రం జంతువు మాదిరిగా ఉన్నాయి. సాధారణంగా మేక పిల్లలకు శరీరమంతా వెంట్రుకలు ఉంటాయి. కానీ మేక పిల్లకు మాత్రం ఒక్క వెంట్రుక కూడా లేకుండా సాధారణ శిశువు రూపంలో జన్మించడంపై స్థానికులు ఆశ్చర్యం వ్యక్తంచేశారు. మొదటి సారి ఈనిన తల్లి మేక ప్రస్తుతం ఆరోగ్యంగానే ఉందని కాపరి మోత్యానాయక్ తెలిపాడు. వింత ఆకారంతో పుట్టిన మేక పిల్లను చూసేందుకు వచ్చిన గ్రామస్తులు.. ఫొటోలు, వీడియోలు తీసుకున్నారని చెప్పాడు.

జన్యుపరమైన లోపంతోనే..

జన్యుపరమైన లోపాలతోనే ఇలాంటి ఘటనలు వెలుగు చూస్తాయి. లక్షల కేసుల్లో ఎక్కడో ఒక చోట ఇలాంటివి జరుగుతాయి. ఇలా పుట్టిన జీవాలు బతికే అవకాశం ఉండదు.

– డాక్టర్ సుధారెడ్డి, పశు వైద్యాధికారి, మంచాల



బండలేమూర్ గ్రామంలో వింత ఆకారంలో జన్మించిన మేక పిల్ల శరీరం



ఆమనగల్లులో అలయ్ బలాయ్ ఆడుతున్న యువకులు



ఆదిబట్ల: మంగళ్‌పల్లిలో పీర్లను ఊరేగిస్తున్న భక్తులు

మత సామరస్యానికి ప్రతీక మొహర్రం

మత సామరస్యానికి ప్రతీకగా మొహర్రం వేడుకలను ఊరువాడా భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పీర్ల చావిడి వద్దకు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకొని మొక్కుబడులు తీర్చుకున్నారు. చావిడిలో ప్రత్యేకంగా అలంకరించిన పీర్లకు ఆయా గ్రామాల్లో భక్తులు పూలు, దట్టీలు సమర్పించారు. హిందువులు, ముస్లింలు కలిసికట్టుగా పీర్ల ఎదుట డప్పుల చప్పళ్లతో ఆడిపాడిన అలయ్ బలయ్ భక్తులను ఆకట్టుకుంది. దీక్ష చేపట్టిన ముస్లిం యువకులు పీర్లను ఎత్తుకుని ఊరేగింపుగా వెళ్లి అనంతరం నిమజ్జనం చేశారు.



కుర్మిద్దలో పీర్ల ఊరేగింపు



కడ్తాల్: మొహర్రం ఉత్సవాల్లో ముస్లింలు



సంకటోనిపల్లెలో విచిత్ర వేషధారణలో యువకులు

గౌడ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా మల్లేశ్‌గౌడ్

కడ్తాల్: కడ్తాల్ మండల గౌడ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా మల్లేశ్‌గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంఘం రాష్ట్ర నాయకులు శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో శనివారం కడ్తాల్ మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మల్లేశ్‌గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గణేశ్‌గౌడ్, వైస్ ప్రెసిడెంట్‌గా రావిచేడ్ రమేశ్‌గౌడ్, లింగంగౌడ్, జంగం సాయిలు,యాదయ్య, ప్రధానకార్యదర్శిగా సుమన్, ప్రచార కార్యదర్శిగా శ్రీశైలంగౌడ్, కోశాధికారిగా వెంకటేశ్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీని సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు యాదయ్యగౌడ్, దేవేందర్‌గౌడ్,బాలకృష్ణగౌడ్, సుధాకర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.



మల్లేశ్‌గౌడ్‌ను సన్మానిస్తున్న నాయకులు

అధ్యక్షుడుగా అల్లాజీగౌడ్

ఆమనగల్లు: కల్వకుర్తి అసెంబ్లీ నియోజక వర్గ గౌడసంఘం అధ్యక్షుడిగా చుక్క అల్లాజీగౌడ్‌ను ఎన్నుకున్నారు. ఆమనగల్లు పట్టణంలోని భవాని గార్డెన్స్‌లో శనివారం కల్వకుర్తి గౌడసంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కల్వకుర్తి అసెంబ్లీ నియోజక వర్గ గౌడసంఘం, గౌడ యువజన సంఘం, మహిళా గౌడ సంఘం నూతన కార్యవర్గాలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కల్వకుర్తి గౌడసంఘం అధ్యక్షుడుగా చుక్క అల్లాజీగౌడ్, గౌరవాధ్యక్షులుగా వితలయ్యగౌడ్, ప్రధాన కార్యదర్శిగా రాఘవేందర్‌గౌడ్(కల్వకుర్తి), వర్కింగ్ ప్రెసిడెంట్‌గా విజేందర్‌గౌడ్‌ను ఎన్నుకున్నారు.

చైతన్యంతో ముందుకు సాగాలి

మంచాల: యాదవులు తమ హక్కుల సాధన కోసం చైతన్యంతో ముందుకు పోవాలని అఖిలభారత యాదవమహాసభ మండల అధ్యక్షుడు ఐలయ్య పిలుపునిచ్చారు. శనివారం మంచాల మండలం నోముల గ్రామంలో నిర్వహించిన యాదవ మహాసభ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాదవులు ఆర్థికంగా, రాజకీయంగా సామాజికంగా ఎదగాలని ఆకాంక్షించారు. హక్కుల కోసం ఐక్యంగా పోరాడాలన్నారు. నోముల గ్రామంలో యాదవ సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా యాదగిరి, ప్రధాన కార్యదర్శిగా శివయాదవ్, యూత్ అధ్యక్షుడిగా అనిల్, ప్రధాన కార్యదర్శిగా కసరమోని అనిల్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల యువజన విభాగం యాదవ సంఘం అధ్యక్షుడు రాజేష్ యాదవ్, నాయకులు బాలరాజు, కృష్ణ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



నూతన కమిటీ సభ్యులకు నియామక పత్రాలు అందిస్తున్న ఐలయ్య తదితరులు

శేరిగూడలో మళ్లీ చిరుత కలకలం

- చిరుత సంచరిస్తున్న ప్రాంతాల్లో అధికారుల పర్యటన
- ఒంటరిగా పొలాల వద్దకు వెళ్లొద్దని డీఆర్‌ఓ ఇంద్రసేనారెడ్డి సూచన

ఇబ్రహీంపట్నం రూరల్: చిరుత సంచరించే ప్రాంతంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పారెస్టు డిప్యూటీ రేంజ్ అధికారి ఇంద్రసేనారెడ్డి ప్రజలకు చెప్పారు. కొద్ది రోజులుగా శేరిగూడ, మల్శెట్టిగూడ ప్రాంతాల్లో చిరుత సంచరిస్తుందని ప్రజలు భయాందోళన పడుతున్న నేపథ్యంలో ఇబ్రహీంపట్నం సీఐ రామకష్ణ, పారెస్టు డిప్యూటీ రేంజ్ అధికారి పర్యటించారు. పొలాల్లో పనిచేస్తున్న రైతులకు అవగాహన కల్పించారు. గతంలో చిరుత సంచరించిందని ప్రజలు చెప్పిన బస్వన్నగుట్ట, పులందరి చెక్‌డ్యాం ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఆర్‌ఓ మాట్లాడారు. ఆటవీ పాంతంలో అడవి జంతువులు సంచరిస్తుంటాయని, ప్రజలు ఒంటరిగా వెళ్లకూడదని హెచ్చరించారు. తప్పని సరిగా చేతుల్లో కర్రలు పట్టుకొని వెళ్లాలని సూచించారు. చిరుతో, హైనో తప్పకుండా గుర్తిస్తామన్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ఆటవీ ప్రాంతంలో సంచరించే జంతువు ఏది అన్నది త్వరలోనే తెలుస్తామన్నారు. అప్పటి వరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.



రైతులు, కూలీలకు అవగహన కల్పిస్తున్న డీఆర్‌ఓ

మళ్లీ కనిపించింది

శనివారం ఉదయం ఓ ఆటోకు చిరుత అడ్డం వచ్చిందని తెలిపారు. అలాగే 11 గంటల సమయంలోనూ ఓ రైతు వ్యవసాయ పొలం వద్ద అటు నుంచి వెళ్లిందని చెప్పారు. వెంట వెంటనే ఒకే ప్రాంతంలో చిరుత కనిపించడంతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. అధికారులు చిరుతను పట్టుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వర్షానికి కూలిన ఇళ్లు

తలకొండపల్లి: వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మండలంలోని వెల్జాల్‌లో ఇళ్లు కూలిపోయాయి. గ్రామానికి చెందిన మంద శాంతమ్మ, కుమ్మరి వెంకటయ్య ఇళ్లు కూలిపోయాయి. శుక్రవారం సాయంత్రం బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు శ్రీనివాసుయాదవ్‌తో కలిసి తహసీల్దార్ కృష్ణ గ్రామంలో పర్యటించి ఇళ్లను పరిశీలించారు. బాధితులను ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి శరత్‌కుమార్, వార్డు సభ్యులు యాదయ్య, కారోబార్ రవి, మోహన్, సుధాకర్, శ్రీశైలం పాల్గొన్నారు.



కూలిన ఇల్లును పరిశీలిస్తున్న శ్రీనివాసుయాదవ్, తహసీల్దార్

పోరాటం ఆగదు

కాంగ్రెస్ నేత డేవిడ్



గట్టుఇప్పలపల్లిలో రిలే నిరాహార దీక్షలు చేస్తున్న జేఏసి నాయకులు, డేవిడ్

తలకొండపల్లి: గట్టుఇప్పలపల్లి గ్రామాన్ని మండలం సాధించే వరకు పోరాటం ఆగదని కాంగ్రెస్ సీనియర్ నేత డేవిడ్ స్పష్టం చేశారు. గట్టుఇప్పలపల్లి గ్రామాన్ని మండలంగా ఏర్పాటు చేయాలని జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారానికి 27వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పరంగా గట్టుఇప్పలపల్లి అన్ని రంగాల్లో ముందంజలో ఉందన్నారు. గతంలో 41 రోజులు దీక్షలు చేశామని, ప్రస్తుతం 27 రోజులుగా దీక్ష చేస్తున్నా.. ప్రభుత్వం స్పందించడం లేదని విమర్శించారు. మండలం ఏర్పాటు చేయాలని ఇటీవల సర్పంచ్, ఉప సర్పంచ్‌లతో పాటు, వార్డు సభ్యులందరూ తమ పదవులకు రాజీనామా చేశారని గుర్తు చేశారు. అయినా ప్రభుత్వంతో ఏ మాత్రం చలనం లేదని తప్పుబట్టారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్‌రెడ్డి, జేఏసీ నాయకులు రేణురెడ్డి, మాజీ సర్పంచ్ జంగమ్మ, మైసయ్య, చెన్నయ్య, రాజేందర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న యాదీలాల్

ఆమనగల్లు: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నష్టపోయిన బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి యాదిలాల్ డిమాండ్ చేశారు. టీడీపీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వర్షాల వల్ల ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. భారీ వర్షాలకు పలు ఇళ్లు కూలిపోయాయని పేర్కొన్నారు. ఇల్లు కోల్పోయిన బాధితులకు ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇండ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం అందించాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో టీడీపీ నాయకులు మల్లయ్య, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలి

ఆమనగల్లు: జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని ఆమనగల్లు ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు రమణారెడ్డి డిమాండ్ చేశారు. ఆమనగల్లు పట్టణంలో శనివారం జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు పోస్టుకార్డులు పంపి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రమణారెడ్డి మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనలో జర్నలిస్టులు ఎంతో కీలకపాత్ర పోషించారని అన్నారు. జర్నలిస్టులకు ఎన్నికల సమయంలో సీఎం కేసీఆర్ హామీలను అమలుచేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆమనగల్లు ప్రెస్‌క్లబ్ సభ్యులు ఆనంద్‌కుమార్, నిరంజన్, శేఖర్, యూనిస్, నరేశ్, అజీం, రవి, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టుకార్డులతో నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు